# తియ్యని విషం


కొయ్యకొండ సత్యానంద్




రంగనాథంగారు ఆలోచిస్తున్నారు.

అతని ఆలోచనలన్నీ 'వాణి' గురించే!

ఆమె కోరిన కోరిక గురించే!

ఆమె అడిగిందాన్నెప్పుడూ అతను కాదనలేదు.... లేదనలేదు.... ఇంత సేపు ఆలోచించలేదు.... 'నన్ను ఆలోచించుకోనీమ్మా' అని ఆమెను, ఆమె ఉత్సాహాన్నీ అదుపులో పెట్టలేదు....

రంగనాథంగారు చాలా లక్షలకు, కోట్లకూ అధికారి కాదుగానీ, బీదవాడు మాత్రం కాదు.... మధ్యతరగతి కుటుంబంలో పుట్టి, కాస్త చదువుకొని, ఆ తర్వాత చిన్న వ్యాపారం మొదలుపెట్టి పైకి వచ్చారు....అయినా అతనిలో పాత భావాలు పోలేదు.... మంచికి, సంస్కారానికి విలువనిచ్చే మనిషి.... కష్టాలు, సుఖాలు తెలుసు అతనికి.... పాత సాంప్రదాయాల్ని, కట్టుబాట్లనూ పాటిస్తారు, నమ్ముతారు.... అక్రమాన్ని, అసభ్యాన్నీ సహించలేరు.... వ్యాపార విషయాలన్నీ అతనే స్వయంగా చూసుకోవడంలో ఆయన ఖాళీగా ఉండడం

కాస్త తక్కువే! పురాతన సాంప్రదాయాల్ని నమ్మినా, వాటిల్లో కన్పించే అన్యాయాల్ని ఖండిస్తారు!

ఆయన ఏకైక సంతానం వాణి!

వాణి భూమ్మీద పడిన కొద్దిరోజుల్లోనే వాణి తల్లి ఈ భూమిని వదలి వెళ్ళిపోయింది.... అప్పటి నుండీ ఆయనకు తోడు, ప్రాణం, సర్వస్వం.... వాణియే అయ్యింది! బంధువులున్నా, అయిన వాళ్ళున్నా....వారందరూ అతని దగ్గరకు అవసరానికే వస్తారు.... వాళ్ళ దగ్గర నుండి నిజమైన అభిమానాన్నీ, ఆప్యాయతనీ పొందలేక పోయారు రంగనాధంగారు....

నిజమైన అభిమానాన్ని, ఆప్యాయతనీ చూపించేవ్యక్తి,చిన్ననాటి స్నేహితుడైన ఒక్క రమణయ్యగారు మాత్రమే!

వాణి ఇంటర్మీడియట్ చదువుతుంది...

ఇంటర్మీడియట్ అయిపోయాక పెళ్ళి చేసేసి, దాన్నొక ఇంటిదాన్ని చేసేస్తే తన బాధ్యత కొంత తీరిపోతుంది.... తర్వాత వాణి సంతానాన్ని చూసుకుంటూ శేష జీవితాన్ని ఆనందంగా గడిపేయొచ్చు... అని అనుకుంటున్నంతలో వాణి ఏమిటిలా అంటుంది?

అది మామూలు ప్రపంచమా? అక్కడ ఆడదానికి నిజమైన మనుగడ ఉందా? అటువంటి ప్రపంచంలోకి అడుగు పెట్టడానికి వాణి ఉవ్విళ్ళూరుతుందిగానీ, అది అక్కడ ఇమడగలదా?

ఆ ప్రపంచం పెద్ద ముసుగేసుకొని ఉంది.... ఆ ముసుగే ఆ ప్రపంచం అనుకొని ఆశ పడుతుందిగానీ, వాణికి ఆ ముసుగు లోపల ఏం జరుగుతుందో తెలియదు, కనీసం ఆలోచించలేదు....ఆ ముసుగును చూసి అదంతా కళా ప్రపంచమే అనుకుంటుంది గానీ, అందులో ఉన్న కసి, కామం, ద్వేషం, పగ, పోటీ, ప్రతీకారం.... వీటిగురించి వాణికి తెలీదు....

రోల్డ్‌గోల్డ్ నగను చూసి బంగార మనుకొని భ్రమపడుతుంది....ఆ జీవితం అంతా నిజమేనని అనుకొని ఉత్సాహాన్ని చూపిస్తుంది....

దానికి ఎలా నచ్చజెప్పాలి? ఎలా చెప్తే నా చిట్టితల్లికి అర్థమౌతుంది?

అలా ఆ విషయం గురించి విపరీతంగా ఆలోచిస్తున్న రంగనాధంగార్కి ఉదయం జరిగిన సంఘటన గుర్తొచ్చింది.

* * *

ఉదయం ఎనిమిదిగంటల సమయం... డైనింగ్‌టేబిల్ దగ్గర కూర్చొని వాణి కోసం ఎదురుచూస్తున్నారు రంగనాధం గారు.... ఒక అయిదు నిముషాల్లో వాణి వచ్చింది హుందాగా నడుస్తూ.

"రామ్మా! లేవడం ఆలస్యం అయ్యిందా?"

"అవును డాడీ!" అంటూ తండ్రి ప్రక్కన కూర్చుంది....రంగమ్మ టిఫిన్ ప్లేటలో సర్దుతుంది....

"రేపు నీ పుట్టిన రోజు కదమ్మా! ఏం కావాలో కోరుకో!" అని అన్నారు లాలనగా వాణివైపు చూస్తూ.

వాణి అందంగా నవ్వింది....అదోలా చూసింది తండ్రివైపు

రంగనాథంగారు ప్రతీ పుట్టినరోజుకి ముందురోజు అలా వాణిని అడగడం, వాణి ఆలోచించి, ఆలోచించి తనకేం కావాలో చెప్పడం.... రంగనాథంగారు మర్నాటికల్లా కూతురు అడిగిందాన్ని ఎంతదూరమైనా వెళ్ళి, వేటాడి, ఎంత ఖర్చు అయినా చేసి తీసుకు రావడం.... రివాజులా జరుగుతుంది....

కూతురు అడిగింది ఎప్పుడూ కాదన లేదు రంగనాథంగారు....

తండ్రి కొనలేనిది ఎప్పుడూ అడగ లేదు వాణి.

వాణి ఏం అడుగుతుందోనని కుతూహలంగా ఎదురుచూస్తున్నారు రంగనాథంగారు....

"....డాడీ! నిన్న సాయంత్రం ఒక మంచి సంఘటన.... నేను జీవితంలో మరచిపోలేనిది, నా జీవితాన్ని పెద్ద మలుపు తిప్పేది అయిన ఒక మంచి సంఘటన ఒకటి జరిగింది..."

"అది తర్వాత చెబుదివి గాన్లేమ్మా! ముందు రేపటికి నీకేం కావాలో చెప్పు! వెంటనే దాన్ని గాలించడానికి వెళ్తాను" అన్నారు....

"ఆగండి డాడీ! నిన్న సాయంత్రం జరిగిన సంఘటనకీ, నేను అడిగేదానికీ మంచి కనెక్షన్ ఉంది....నిన్న నేను నా ఫ్రెండ్స్‌తో పార్కులో కూర్చొని ఐస్‌క్రీం తింటుంటే ఒకాయన మా దగ్గరకు వచ్చారు డాడీ! ఎవరా అని అతన్ని చూస్తే ఇంకేముంది డాడీ, ఆయన సినీడైరెక్టర్ నారాయణశర్మగారు. అప్పుడు నేను భలే ఆశ్చర్యపోయాను డాడీ! ఆయన నాతోనే మాట్లాడ్డం మొదలు పెట్టేరు డాడీ! శర్మగారు ఏదో సినిమా, అందులోనూ హీరోయిన్ ఇంపార్టెంట్ స్టోరీతో సిన్మా తీస్తున్నారట డాడీ! అది ఆయన సొంతసిన్మా అట! క్రొత్త నటీ నటుల్తోనే తీస్తున్నారట కూడా! ఆ సిన్మాకి క్రొత్త హీరోయిన్‌కోసం గాలిస్తున్నారట డాడీ! ఇంకా పేపర్లలో, పత్రికల్లో ప్రకటన కూడా ఇద్దామనుకుంటున్నారట డాడీ! ఇంతలో వాళ్ళు నన్ను చూసారట.. ఇట్స్ మై లక్.... మొదట వాళ్ళు నన్ను నా చదువు, ఇతర విషయాలూ అడిగారు... ఆ తర్వాత వాళ్ళు ఏమన్నారో తెలుసా డాడీ! 'ఆ హీరోయిన్ వేషం మీకు ఇస్తాను.... మొదట ఇంట్లోవాళ్ళను అడిగి, వాళ్ళేమన్నారో మాకు తెలియ బరిస్తే మేం కొంతమంది మీ ఇంటికి వస్తాం' అని అన్నారు.... వాళ్ళకు మన అడ్రస్ ఇచ్చి, మీ గురించి చెప్పాను డాడీ! మీరు తప్పకుండా అంగీకరిస్తారని కూడా వాళ్ళకు చెప్పాను...."

రంగనాథంగారికి విషయం

అర్థమైంది.... ఇంకా ఏవేవో మాట్లాడు తున్న వాణి మాటల్ని ఆలకించకుండా ఆలోచనల్లో పడిపోయారు ఆ క్షణం నుండి!

"....రాత్రే అడగుదామనుకున్నాను డాడీ! ఎలాగూ రేపు ఉదయం నన్ను నా పుట్టినరోజుకి ఏం కావాలి అని అడుగు తారు కదా, అప్పుడు నా కొచ్చిన ఈ అవకాశానికి మీ అనుమతిని ఇవ్వండి డాడీ, అని అడుగుదామని అనుకున్నాను.. ఈ ఆనందంలో రాత్రి అసలు నిద్రే పట్టలేదు తెలుసా డాడీ?" అంటూ తండ్రి వైపు చూసి వాణి మాట్లాడ్డం మానేసింది..

రంగనాథంగారు తిరుగుతున్న ఫాను వైపు చూస్తూ ఏదో ఆలోచిస్తున్నట్లుగా కన్పిస్తున్నారు.

"డాడీ! ఆలకిస్తున్నారా?" అని తండ్రి భుజంమీద చెయివేసి కుదిపింది వాణి.... ఉలిక్కిపడ్డట్టయి.... "ఆఁ ఆలకిస్తున్నా నమ్మా.... చెప్పు...." అన్నారు....

"నేను చెప్పడానికి ఇంకేం లేదు డాడీ! మీరే చెప్పాలి ..."

ఒక్క క్షణం ఏం మాట్లాడలేదు రంగనాథంగారు....

"నీ క్కావాల్సింది నా అనుమతి.... అనుమతి కేంగానీ, నువ్వేం నటించ గలవమ్మా?" అని అన్నారు నవ్వుతూ రంగనాథంగారు....

ఆ మాటకు తండ్రివైపు ఆశ్చర్యంగా చూస్తూ.... "అదేంటి డాడీ! ఇప్పుడు సినిమాల్లో నటిస్తున్న ఎవరికి నటించడం వచ్చని? క్రొత్త నటులు అందరూ నటించడం నేర్చుకొనే సినిమాలో చేరతారనుకున్నారా? సినిమాల్లో చేరి దర్శకులు చెప్పినమీదట నటించడం నేర్చుకుంటారు... వాళ్ళే కావాలని కోరుకుంటున్నప్పుడు మన కెందుకు డాడీ, ఆ విషయాలు? అయినా, మీకు తెలీదు గాని డాడీ, సినిమాల్లో అసలు నటించ కూడదు, ఆ పాత్ర ఎవరో కాదు నేనే, అన్నట్లుగా ప్రవర్తించాలి.... అప్పుడే నాచురాలిటీకి దగ్గరౌతాయి ఆ పాత్ర, ఆ సన్నివేశమూను....సపోజ్, మీలాంటి తండ్రిపాత్ర ఉందనుకోండి .... ఒక కూతురుగా ప్రవర్తించాలి ఆ పాత్ర దగ్గర.... అన్నయ్య అనే పాత్ర దగ్గర సొంత చెల్లెలిగా ప్రవర్తించాలి...అలాగే లవర్ ఆర్ హస్బెండ్ పాత్ర......"

వదవడా వాగుతున్న వాణి ఒక్కసారిగా ఆగిపోయింది.

అలా ఆగిపోయిన వాణితో .... "ఏమ్మా? ఆగిపోయావేం? చెప్పు .... ప్రియుడి దగ్గర అసలైన ప్రియురాలిలాగ, భర్తదగ్గర సొంత భార్యలాగే ప్రవర్తించాలి....అప్పుడే రియాలిటీ, నాచురాలిటీ కన్పిస్తుంది. అంతేగా?" అన్నారు.

వాణి దొరికిపోయినట్లుగా తండ్రివైపు చూసింది...

"అదే....ఎస్...అదే డాడీ! అది కూడా నటనే కదా? ఇంతకీ మీ అభిప్రాయం

ఏమిటి డాడీ? చెప్పండి డాడీ! అదే నా బర్త్‌డే గిఫ్ట్.... వాళ్ళని మనింటికి అహ్వానించమంటారా?"

సరిగా వివరించలేని కూతురి పరిస్థితికి నవ్వొచ్చింది రంగనాథంగార్కి....

"చూడమ్మా! వాణీ! తండ్రిగా, తల్లి లేని కూతురికి తల్లిగా నేనిప్పుడు రెండు పాత్రల్ని పోషిస్తున్నాను....ఇది నీ జీవితానికి సంబంధించిన విషయం.... అంటే నా గుండెకు సంబంధించిన విషయం అన్నమాట....మరి నా గుండె గురించి నేను కాస్త ఆలోచించుకోవాలి కదమ్మా?"

వాణి ఆ మాటకు కిలకిలా నవ్వింది...

'అయితే డాడీ, మీ గుండె గురించి ఆలోచించుకోవడానికి ఎంత టైంకావాలి?' అని అడిగింది.

"....సాయంత్రం అయిదు గంటలకు నా గదిలోకి రామ్మా నువ్వు.... అప్పుడు చెప్తాను నా నిర్ణయాన్ని...."

"సరే డాడీ! ఐ హోప్ దట్ యువర్ డెసిషన్ విల్ బి పోజిటివ్ టు మై ఇంట్రెస్ట్....సాయంత్రం సరిగ్గా అయిదు గంటలకు వస్తాను డాడీ...." అని టిఫిన్ తినేసి "నేను నా ఫ్రెండ్స్ అందరికీ ఇన్విటేషన్స్ ఇచ్చివస్తాను డాడీ!" అని అక్కడనుండి వెళ్ళిపోయింది వాణి....

• • •

అప్పటినుండే రంగనాథంగారు ఆలోచనలో పడిపోయారు....

పిచ్చిపిల్ల.... చిన్నపిల్ల.... జీవితం అంటే ఇంకా ఏమీ తెలియని వయసు... అన్నింటిచేతా ఆకర్షింపబడే మనసు.... కాదంటే తట్టుకోలేని మెత్తని మనసు...

ఇప్పుడు నా నిర్ణయం ఏమిటని చెప్పాలి వాణితో?

'సరే' అనా?

వద్దనా?

సరే....అంటే ఫర్వాలేదు.. వద్దంటే? వాణి ఏమంటుంది? ఏమైపోతుంది? ఏం చేస్తుంది? ఏం జరిగినా బాధపడాల్సింది నేనే! దేనికైనా బాధ్యత వహించాల్సింది నేనే!

ఆలోచనల సుడిగుండంలో చిక్కుకుపోయారు రంగనాథంగారు....

## 2

సమయం సరిగ్గా అయిదుగంటలు అయింది....


రంగనాథంగారు ఒక నిర్ణయాని కొచ్చేసారు....

గోడ గడియారం ఐదోగంట కొట్టీ కొట్టడంతోనే ఆ ఆఖరు గంటకోసం బయట వెయిట్‌చేస్తున్న వాణి పరుగు పరుగున వచ్చేసింది కన్నెలేడిలా!

"డాడీ! చెప్పండి డాడీ! మీ నిర్ణయం ఏమిటి? పోజిటివ్వేనా?"

రంగనాథంగారు వాణివైపు ప్రేమగా చూసారు....

"వాట్ డాడీ? అలా చూస్తారేం? పోజిటివేనా?" అని అడిగింది ముద్దుగా...




రంగనాథంగారు చిన్నగా నవ్వి "నీ మాటను నే నెప్పుడు కాదన్నానమ్మా? నీ ఇష్టమే నా ఇష్టం.... కానీ, ఇది జీవితం! వేసే ప్రతి అడుగూ జాగ్రత్తగా చూసుకొని వేయకపోతే చాలా ప్రమాదాలు, విపత్కర పరిస్థితులు ఎదురౌతాయి.... నువ్వెంత పేరు తెచ్చుకున్నా, ఎంత పేరు రాబోతున్నా ఆడదానివన్న విషయాన్ని మాత్రం మరచిపోకు.... విష్ యూ గుడ్ లక్!" అన్నారు....

తండ్రి చెప్పిన ఆ మాటకు వాణి ఆనందంతో పొంగిపోయింది....

"డాడీ! మై హార్ట్! మై వెల్ విషర్!" అంటూ తండ్రిని అమాంతం కౌగలించుకుంది ఈ కాలం సినిమా (లో) హీరోయిన్లా....

రంగనాథంగారు ఆశ్చర్యపోయారు.

* * *

సినిమా జోరుగా సాగిపోతుంది.... కథలో విషాదం....కథనంలో దర్శకుడు తన ప్రతిభను నిరూపించుకుంటున్నాడు... సినిమా చూస్తున్న ప్రేక్షకుల గుండెలు బరువెక్కిపోతున్నాయి.... కొందరు ఆడవాళ్ళైతే, కన్నీళ్ళు కూడా పెట్టుకుంటున్నారు- ఆ పాత్ర యొక్క పరిస్థితిని, నాయిక నటననూ చూసి....

నాయికగా వాణి ఎంతో నేర్పుతో నటిస్తోంది.... ఒక అనుభవశాలి అయిన

నటీమణిగా కన్పిస్తోంది రంగనాథంగారిక్కి వాణి.... తన కూతురేనా ఇంత చక్కగా నటిస్తుంది? ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉంటూ, కన్నీరంటే ఎరుగని వాణి ఇంత మంది గుండెల్ని స్పందింపజేస్తుందా?

రంగనాథంగారి గుండె కూతురి గొప్పదనానికి ఆనందంతో నిండిపోతుంది. ఆమె పోషిస్తున్న పాత్ర పరిస్థితికి బాధ పొంగిపోతుంది....

ఆ సన్నివేశం అయిపోయే సమయంలో ఆ హీరోయిన్ ఒక్కసారి అక్కడున్న టేబుల్‌మీదున్న రాధామాధవుల విగ్రహంవైపు చూస్తుంది.... ఆ విగ్రహాన్ని చూడగానే ఆమెకు గతం గుర్తుకొస్తుంది....

గతంలో - హీరో హీరోయిన్ని కాలేజీలో ఏడిపిస్తాడు.... అలా రెండు మూడు సంఘటనల తర్వాత హీరోతో హీరోయిన్ 'నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను' అని అంటుంది.... అలా అన్న మరుక్షణంలో హీరో హీరోయిన్ను ఒక్కసారిగా అమాంతంగా, గట్టిగా కౌగలించుకుంటాడు. హీరోయిన్ కూడా హీరోని గట్టిగా పెనవేసుకుంటుంది....

ఆ వెనువెంటనే బీచ్ దగ్గర ఓ పాట..

ఆ పాటలో- హీరో హీరోయిన్ను ఇష్టమొచ్చినట్లు నలిపేస్తున్నాడు .... సముద్రపు నీటితో శుభ్రంగా తడిపేస్తున్నాడు.... చీరంతా విప్పేసాడు మరు నిముషంలో.... హీరోయిన్ ఒంటిమీద సన్నని జాకెట్టు, సన్నని లంగా.... శరీరమంతా స్పష్టంగా కన్పిస్తుంది.... హీరో ఆ నీటిలో హీరోయిన్ను పట్టుకొని దొర్లిస్తున్నాడు.... ఫోటోగ్రాఫర్ అస్తమానూ హీరోయిన్ రొమ్ముల్ని, పిరుదుల్ని క్లోజప్‌లో తీస్తుంటే ప్రేక్షకులు కొందరు చప్పట్లు కొట్టేస్తున్నారు.... ఈలలు వేసేస్తున్నారు....

పాట సగమే అయ్యింది.... ఇంకా సగం ఉంది....

ఆ తర్వాత హీరో హీరోయిన్‌ని ఇంకా ఏమేమి చేస్తాడా? అని రెప్పల్ని వేయడం మానేసి, కళ్ళను ఇంతింత చేసుకొని, ఊపిర్ని బిగబట్టేసి ఆనందోత్సాహాల్తో చూస్తున్నారు ప్రేక్షకులు....

రంగనాథంగారు ఇంకా హాల్లో కూర్చోలేకపోయారు....

అతని దృష్టిలో అది సినిమాలాగ కన్పించలేదు.... ఆడదాని శరీరాన్ని కళ అన్న పేరుతో వీలైనంత పూర్తిగా, అసభ్యంగా చూపించే దారుణకృత్యంలా కన్పిస్తుంది....

వెంటనే లేచి బయటకు వెళ్ళిపోయారు....

ప్రక్కన వాణి లేదు.... ఇంట్లోనే కూర్చొని తనని తెగ పొగడుతున్న ఫ్రెండ్సుతో కబుర్లాడుతూ గడుపుతుంది... ప్రివ్యూ వేసిన రోజున వాణి రమ్మంది గానీ, రంగనాథంగారికి కుదరక వెళ్ళ లేదు....ఈ రోజు వ్యాపార విషయంలో



ఊళ్ళోకి వచ్చి కాస్త సమయం చిక్కితే ఎలాగూ చూడలేదు కదా అని సినిమా హాలు వైపుకు దారితీసారు....

హాల్లోకి వెళ్ళేముందు కన్పించిన వాల్‌పోస్టర్లు, కటౌట్‌లు, స్టిల్స్.... వీటిని చూసినప్పుడే రంగనాథంగారు అదోలా ఫీలయ్యారు.... కానీ చాలా మంది చెప్పుకోగా విన్నారు వాణి చాలా బాగా నటించిందని.... అందుకే సినిమా చూసారు....

అంతా బాగానేఉందిగానీ ఆ పాటలో... ఆ తర్వాత ఇంకేమి జరిగిందో?

రంగనాథంగారు తనను తాను సమాధానపరచుకోలేకపోతున్నారు.

అతని భావాలు, ఉద్దేశ్యాలు, అభిప్రాయాలు, మనస్తత్వం ఆలాంటివి!

అబ్బ! ఆ సినిమాలోనే అంత ఇడిగా ఉందంటే, ఇక షూటింగులో ఇంకెంత దారుణంగా జరిగిందో?

ఒక సందేశాన్ని, నీతిని చెప్పాల్సిన సినిమా.... అసభ్యతను, అశ్లీలతను చూపించి దాన్ని ప్రేమ అని పిలుస్తుందా! అది ప్రేమ సన్నివేశమేనా నిజంగా?

పూర్వం సినిమాల్ని ఎంత చక్కగా తీసేవారు! ఆ సినిమాల్ని ఈ సినిమాతో పోల్చడానికి ఎక్కడైనా తావుందా?

ఈ వ్యాపారం విషయంలోపడి వాణితో పై వూర్లో షూటింగ్‌కు వెళ్ళడానికి కుదరడంలేదు.... ఈ సారి వాణితో చెప్పేయాలి.... పై ఊర్లు షూటింగ్‌కు వెళ్ళొద్దని.... అంతగా వెళ్ళడం తప్పనిసరైతే తనుకూడా వాణితో షూటింగ్‌కు వెళ్ళాలి.... లేకపోతే ఇంక సినిమాలే మానెయ్యమని చెప్పాలి....

ఇలా అనేక రకాలుగా ఆలోచిస్తూ ఇల్లు చేరుకున్నారు రంగనాథంగారు.... ఇంటికి వెళ్ళేసరికి వాణి నిద్రపోతోంది.. లేకపోతే ఏదో ఒకటి అప్పుడే అనేసేవారు!

* * *

మొదటి సినిమా సక్సెస్ కావడంతో వాణికి మంచి పేరొచ్చింది.... మంచి మంచి అవకాశాలొస్తున్నాయి.... ఆ విషయమే తండ్రితో ప్రస్తావించింది వాణి...

"వద్దమ్మా! నువ్వింక సినిమాల్లో నటించకు."

"అదేమిటి డాడీ?" ఆశ్చర్యంగా అడిగింది.... వాణి....

"నిన్న నీ సినిమా చూసానమ్మా...."

వాణి ముఖం సంతోషంతో విప్పారింది.... "రియల్లీ? నేను రమ్మని ఎన్ని సార్లు రిక్వెస్టుచేసినా ఖాళీ లేదన్నారు!"

"నిన్న కాస్త సమయం చిక్కిందిలే!"

"ఎలా ఉంది డాడీ మీ డాటర్ ఏక్షన్?"

"చాలా బాగుందమ్మా!"

"మరైతే ఎందుకు డాడీ నన్నింక సినిమాల్లో నటించొద్దంటున్నారు? అసలు ఫస్ట్ పిక్చర్ సక్సెస్ కావడమే పెద్ద అదృష్టం.... వస్తున్న అవకాశాన్ని జారవిడుచుకోవడం తెలివితక్కువతనం డాడీ! ఇవాళ వద్దని కాలదన్నినా, రేపొద్దున కావాలన్నా దొరకని అవకాశాలు డాడీ ఇవి!"

"....రేపు కూడా వద్దనుకుంటే?"

"అదేమిటి డాడీ, అలా మాట్లాడుతున్నారు?" ఉత్సాహంగా అడిగింది....

"చెప్పాను కదమ్మా, నిన్న నీ సినిమా చూసానని.... చాలా బాగా నటించావ్.... కానీ, ఆ పాట.... బీచ్ దగ్గర పాట మాత్రం.... అలా ఉందేమిటమ్మా?"

విషయం అర్థమైంది వాణికి.. కాసేపు ఏమీ మాట్లాడలేదు....

"ఎంత నటన అయితే మాత్రం.... నాకు నచ్చలేదమ్మా!"

"వ్వాట్ డాడీ, మీరూ అలా ఆలో చిస్తున్నారు? సినిమా అన్నాక అలాంటి సీన్స్ ఉండటం నాచురల్! అలాంటి విష యాల్ని మనం అంతగా పట్టించుకో కూడదు డాడీ!"

"నేను పట్టించుకోకుండా ఉండలే నమ్మా! ఇట్స్ మై వీక్‌నెస్.... నా మాట విని నువ్వు ఇంకే సినిమాలోనూ నటించ డానికి ఒప్పుకోకమ్మా...." కొంచెం గట్టిగానే అన్నారు....

"సరే డాడీ, అందుకే నన్ను మీరు సినిమాలో నటించొద్దు అని అంటే, ఇక ముందు సినిమాలకు ఒప్పుకొనే ముందు ప్రొడ్యూసర్లతో, డైరక్టర్లతో, అలాంటి సీన్స్ ఉంటే నటించనని చెప్పేస్తాన్లే డాడీ! సరేనా?" అంది....

రంగనాధంగారు సరే అనలేదు గానీ, అంగీకారప్రాయంగా తల పంకించారు...

ఆయన కూతురికి గట్టిగా వద్దని చెప్పాలని ఉన్నా, ఆమె మాటను కాదన లేకపోతున్నారు....

* * *

వాణి సినిమాల్లో నటిస్తుంది.... వీలు న్నంతవరకూ వాణితో పాటు రంగనాధం గారు కూడా షూటింగ్‌కు వెళ్తున్నారు... గ్లామర్ ఇంపార్టెంట్ పాత్రలు, సెక్స్ ఎప్పీల్ సన్నివేశాలు, ఓవర్ యాక్షన్ పాటలు ఉన్న చిత్రాల్ని అంగీకరించక పోవడం వల్ల ఇక్కా సినిమాల అవకాశాన్ని పోగొట్టుకుంది వాణి....

"మరి ఈ కాలం సినిమాల్లో ఇటు వంటివి లేకపోతే సినిమాలు పదిరోజులు కూడా ఆడవు.... మీ ఏద క్రేజ్ పెర గాలంటే మీరు అన్ని రకాల పాత్రలూ ధరించాలి.... లేకపోతే, మీరు సినిమా నటిగా నిలబడలేరు...." అని ఎన్నో విషయాల్ని, ఇతర నటీమణుల్నీ ఉదా హరణలుగా చెప్పి ఒప్పించడానికి ప్రయ త్నించేవారు నిర్మాతలూ, దర్శకులూ....

అయినా వాణి ఒప్పుకోలేదు....

మొదటి సినిమా హౌస్‌ఫుల్ కలెక్ష న్లతో వందరోజులు ఆడింది. పెద్దఎత్తున సభ ఏర్పాటుచేశారు .... వాణిని సినీ ప్రముఖులెందరో ఎంతగానో పొగిడారు..

ఎంతోమంది వాణిని ఒప్పించడానికి ప్రయత్నించారు.... వాణికి ఇష్టమైనా తండ్రిమాట మీదట ఒప్పుకోలేక పోయింది.... అప్పుడప్పుడు తండ్రిమీద విసుక్కునేది ఈ విషయంలో....

వాణి సినిమానటి అయ్యిందని తెలిసి రంగనాధగారి బంధువులెందరోవచ్చారు.. ఎంతో మెచ్చుకున్నారు.... వాణితోపాటు షూటింగులకి వెళ్ళడానికి, వాణి మంచి చెడ్డలు చూడడానికి రంగనాధంగారి విధవ అక్క అయిన శాంతమ్మను తమతోపాటూ ఉండమన్నారు....

అందుకు శాంతమ్మ ఒప్పుకుంది.

* * *

కారును నెమ్మదిగా నడుపుతున్న రంగనాథంగారి దృష్టి ఎదురుగా వస్తున్న మరో కారులో పడింది. ఆ కారులో యువ దర్శకులు చక్రధర్, వాణి ఉన్నారు.

రంగనాథంగారి కారు సడన్‌గా ఆగి వెనక్కి తిరిగిపోయి ఆ కారును ఫాలో అయ్యింది.

ముందువెళ్తున్న కారు పెద్దహోటల్లోకి వెళ్ళిపోయింది. రంగనాథంగారు తన కారును రోడ్డుమీదే ఆపుచేసి హోటల్ లోకి వెళ్ళారు.... కాఫీసెక్షన్‌లోకి వెళ్ళి చూస్తే అక్కడ ఎవ్వరూ కన్పించలేదు. వెనక్కి తిరిగి వస్తుంటే చక్రధర్ మేనేజరుతో ఏదో మాట్లాడుతున్నాడు .... ప్రక్కనే వాణి ఉంది. ఆ ఇద్దరూ తనని చూసే అవకాశం లేని ప్రదేశంలో నిల్చున్నారు రంగనాథంగారు....

ఒక అయిదు నిముషాల తర్వాత ఇద్దరూ లోపలకు వెళ్ళిపోయారు .... రంగనాథంగారిక్కి వాళ్ళు లాడ్జ్‌రూమ్ బుక్‌చేసుకున్నారని అర్థమైంది.... వెంటనే వెనక్కి వచ్చేసారు.

* * *

గడియారం పది గంటలు కొట్టింది ..

బయట కారు ఆగిన శబ్దం విన్పించి వాణిగదిలో కూర్చున్న రంగనాథంగారు కిటికీ తలుపుని తీసి బయటకు చూసారు .... ఆ కారు ఇందాకటి కారే! వాణి ఫ్రంట్ సీట్లోంచి దిగుతూ చక్రధర్‌కి టాటా చెప్తోంది.... చక్రధర్ కూడా టాటా చెప్తూ ఏదో అన్నాడు.... వాణి నవ్వింది.

ఆ కారు కదిలాక ఏదో పాటను హమ్‌చేస్తూ మేడపైకి వచ్చి తన గదిలోకి వెళ్ళిన వాణి తన గదిలో ఉన్న తండ్రిని చూసి ఆశ్చర్యపోయినట్లుగా, బెదిరిపోయినట్లుగా అయిపోయింది .... ఆ మరుక్షణంలోనే తెచ్చిపెట్టుకున్న నవ్వు నవ్వుతూ "హాయ్ డాడీ! ఇంకా నిద్ర పోలేదా?" అని అడిగింది....

"లేదమ్మా! నిద్ర రాలేదు.... చాలా రాత్రయ్యింది. ఎక్కడికెళ్ళావ్? షూటింగ్ లేదుగా?"

వాణి కంగారుపడినదై "మొన్న ఒక పిక్చర్లో నటించడానికి ఒప్పుకున్నాను కదు డాడీ, ఆ పిక్చర్ స్టోరీ డిస్కస్ చేయడానికి...." అంది.

"స్టోరీ వినకుండానే ఆ పిక్చర్లో నటించడానికి ఒప్పుకున్నావా అమ్మా? మరి శాంతమ్మను తీసుకువెళ్ళలేదే?"

"శాంతమ్మత్తను నేను రమ్మన్నాను డాడీ! కానీ, డైరెక్టర్‌గారే స్టోరీ డిస్కషన్‌కు శాంతమ్మత్త ఎందుకులే అన్నారు డాడీ.... అందుకే...."

వాణి మాట పూర్తికాకుండానే "ఇంత వరకూ స్టోరీ డిస్కషన్ మనింట్లోనే జరిగేది కదా? మరి లాడ్జి రూమ్

ఎందుకు తీసుకున్నట్టు?" అని అడి గారు ...

ఉలిక్కిపడ్డట్టయి తండ్రివైపు చూస్తూ ఉండిపోయింది వాణి ఓ నిముషంసేపు .... తర్వాత తనే అంది .... "మరి డైరెక్టర్‌గారు అక్కడికే రమ్మన్నారు .. ఆ లాడ్జ్ వాళ్ళ బంధువులదేనట ...."

"వాణీ! జీవితంలో నటించడం అన్నది సినిమాలో నటించడం అంత సులభం కాదమ్మా! పోతూ పోతూ మీ అమ్మ నిన్ను నా చేతిలో పెట్టిపోయింది. నిన్ను, నీ భవిష్యత్తును తీర్చిదిద్దుతానన్న నమ్మకంతో వదిలిపెట్టిపోయింది.... కానీ, నేను ఓడిపోయానమ్మా, ఓడి పోయాను! నా బాధంతా నీ గురించే నమ్మా ...." రంగనాథంగారి గొంతు పూడుకుపోయింది....

"ఇప్పుడేమైందని డాడీ అలా బాధ పడుతున్నారు? సినిమాఫీల్డ్ అన్నాక పది రకాల మనుషుల్తో పదిరకాలుగా మాట్లాడాల్సొస్తుంది, మసలాల్సొస్తుంది .... ఎవరినీ అంటకుండా, ముట్టకుండా పైకిరావడం కుదరదు డాడీ! అయినా నా గురించి నేను ఆలోచించుకోలేని వయస్సు కాదు నాది! నా జాగ్రత్త నేను తీసుకోవడం తెలియని తెలివితక్కువ దాన్ని కాను నేను.... అన్నింటిలో మీ రెందుకు కలగజేసుకుంటారు?" అని విసురుగా బాత్రూంలోకి వెళ్ళిపోయింది వాణి....

కూతురు అన్న ఆ మాటలను విన్న రంగనాథంగారు మ్రాన్పడిపోయారు....

పదిరకాలుగా మాట్లాడాల్సొస్తుంది.... మసలాల్సొస్తుంది.... నా జాగ్రత్త నేను తీసుకోవడం తెలియని తెలివితక్కువ దాన్ని కాను నేను....

ఆ మాటలే అతని చెవుల్లో గింగుర్లు పెడుతున్నాయి.... ఆ మాటలు పదేపదే వినబడుతుంటే రంగనాథంగారు వణికి పోయారు భయంతో.... బాధతో!

* * *

రంగనాథంగారు మెట్లు దిగుతుండగా వినిపిస్తోన్న మాటలు అతని అడుగుల్ని ముందుకు పడనియ్యలేదు....

శాంతమ్మ అంటోంది పనిమనిషితో.... వాళ్ళిద్దరూ మెట్లప్రక్కనున్న కిచెన్ రూమ్ గుమ్మం దగ్గర ఉన్నారు....

"....అంతేనే మరి! ఇంకెవడు చేసు కుంటాడు దీన్ని? సినిమాల్లో దీని తైతక్కలు, గెంతులు, ఎవడ్ని పడితే వాడ్ని కావలించుకోవడం, ఎవడొచ్చినా వాడితోపాటు ఎక్కడికి పడితే అక్కడికి ఎప్పుడు పడితే అప్పుడు వెళ్ళడం చూసే .... అవ్వ! ఇవన్నీ తెలిసినవా డెవ్వడు దీన్ని పెళ్ళిచేసుకుంటాడు! ఒక వేళ చేసుకున్నా రెండో పెళ్ళివాడో, ముసలాడో, డబ్బుకాశించినోడో చేసు కుంటాడు.... చేసుకొని దీన్నో ఉంపుడు కత్తెగానే చూసుకుంటాడు గానీ కట్టు కున్న పెళ్ళాంలా చూసుకుంటాడా

ఏమిటి? ఏదైనా రంగమ్మా, ఆడదానికలాంటివేంటి చెప్పు? ఇప్పుడంటే కాలం మారిపోయి సినిమాలో జాయినై నోళ్ళి పెద్ద గొప్పగా చూస్తున్నారుగానీ, మా కాలంలో సినిమాలో చేరిందాన్ని సానిదానికన్నా తక్కువగా చూసేవారు .... తెలుసా? అయినా మా తమ్ముడికి బుద్ధిలేదులెద్దూ.. అదే నా కూతురైతేనా? రెండు రెక్కలూ విరిచేసి గదిలో ఓ మూల పడేసేదాన్ని..."

శాంతమ్మ మాటలు అలా సాగుతూనే ఉన్నాయి....

రంగనాధంగారికి ఆ మాటలు శూలాల్లా గుచ్చుకున్నాయి.... అతని గుండె తెగిపోయి ఒక్కొక్క మాటకూ ఒక్కొక్క మెట్టుమీదనుండి క్రిందకు పడిపోతున్నట్లుగా ఉంది....

"అక్కయ్యా!" అని గట్టిగా అరవాలనుకున్నారు రంగనాధంగారు.... కానీ, ఆ మాటల్లో రంగనాధంగారికి ఉన్నదనిపిస్తున్న నిజం అతని గొంతుక్కి అడ్డు పడిపోయి ఆ అరుపును బయటకు రానివ్వలేదు....

* * *

"చాన్నాళ్ళకు వచ్చావురా, అసలు నీకో మిత్రుడున్నాడన్న సంగతే నీకు గుర్తున్నట్టు లేదు!" అన్నారు రమణయ్యగారు నవ్వుతూ....

"ఏముందిరా, ఎక్కడా తీరిక ఉండడంలేదు...." అన్నారు రంగనాధంగారు తెచ్చిపెట్టుకున్న నవ్వుతో....

అంతలో రమణయ్యగారి భార్య లక్ష్మి కాఫీకప్పుతో వచ్చి "ఏమిటన్నయ్యగారూ బొత్తిగా రావడం మానేసారు!" అంది....

"ఎలా వస్తాదే? ఒకప్రక్క వ్యాపారంలో వచ్చిన డబ్బుని, ఒకప్రక్క కూతురు సినిమాల్లో నటిస్తూ సంపాదిస్తున్న డబ్బును లెక్కపెట్టుకోడానికే సమయం చాలడంలేదు వాడికి!"

రమణయ్యగారు అన్న ఆ మాట రంగనాధంగారి మనసుమీద కొరడా దెబ్బలా తగిలింది....


నవ్వలేక నవ్వేరు....

"కాఫీ త్రాగండి అన్నయ్యగారూ!" అని రమణయ్యగారి భార్య లోపలికెళ్ళిపోయింది....

మనసు ఆత్రుతపడుతున్నా, సమయం కోసం ఎదురుచూస్తూ కాఫీ త్రాగుతున్నారు రంగనాధంగారు.... రమణయ్యగారు చిన్నప్పటి విషయాలు, తన ఉద్యోగం విషయాలూ ఏవేవో మాట్లాడుతూ సరదాగా నవ్వుతున్నారు....

రంగనాధంగారు కాఫీ త్రాగేసారు .... వచ్చిన విషయం తనే కల్పించుకొని మాట్లాడకపోతే వీడు నన్ను మాట్లాడనిచ్చేలా లేడని అనుకొని రంగనాధంగారే మొదలుపెట్టారు....

"ఒరే, గతాన్ని మరచిపోవన్న నమ్మకంతో ఒక ముఖ్యమైన పనిమీద




నీ దగ్గరకు వచ్చాను.... ఆ పనేమిటో చెప్పమంటావా?"

"చెప్పరా! గతం ఏమిటి, ముఖ్యమైన విషయం ఏమిటి? అయినా నువ్వు వచ్చినప్పుడే అనుకున్నాను ముఖ్యమైన పనేదో ఉండి ఉంటుందని!"

"చెప్తాను గానీ, మీ అబ్బాయికి ఇంకా పెళ్ళిచేయవా?"

"ముఖ్యమైన విషయం అంటే ఇదా? ఇంకేదో అనుకున్నాను.... ఎందుకు చేయను? మంచి సంబంధం దొరికితే ఈ సంవత్సరంలోనే చేసేద్దామనుకుంటు న్నాను.... నీ ఎరికలో ఏమైనా మంచి సంబంధం ఉంటే చూడరా!"

రమణయ్యగారి మాటలకు ఆశ్చర్యంగా, దెబ్బతిన్నట్టుగా చూసారు రంగనాథంగారు.... ఒక నిముషంసేపు ఏమీ మాట్లాడలేకపోయారు ...

"ఏరా మాట్లాడవేం? అలా ఉన్నావేమిటి?"

"ఏం మాట్లాడనురా? అన్న మాటను మరచిపోయిన మిత్రుడితో ఏం మాట్లాడగలను?"

"అన్న మాట ఏమిటి? మరచిపోవడం ఏమిటి? చెప్పేదేదో సూటిగా చెప్పరా.... కొంత అర్థమయ్యేట్టు మాట్లాడు...."

ఒక్కసారి భారంగా నిట్టూర్చి "పదిహేను సంవత్సరాల క్రిందట మనిద్దరం ఒకే ఇంట్లో ఉండేవాళ్ళం చూడు.... అప్పుడు మా అమ్మాయిని చూసి నువ్వేమనేవాడివో ఒక్కసారి గుర్తుతెచ్చుకో! గుర్తొస్తే నీకు విషయం

అర్థమౌతుంది, నే వచ్చిన పనీ అయిపోతోంది" అన్నారు రంగనాథం గారు....

ఒక నిముషం ఆలోచించింతర్వాత రమణయ్యగారి ముఖంలో రంగులు మారాయి....

"గుర్తొచ్చిందా?"

రమణయ్యగారు ఒక్క నిముషం ఏమీ మాట్లాడలేదు.... తర్వాత రమణయ్యగారే అన్నారు....

"అర్థమయ్యిందిరా.... నువ్వొచ్చిన పని అదే అయితే నన్ను నువ్వు క్షమించాలిరా!"

"ఒరేయ్ రమణా! ఏమిట్రా నువ్వనేది?" వణికిపోతున్న కంఠంతో అన్నారు రంగనాథంగారు....

"నేను ఏమీ మరచిపోలేదురా! కానీ, మరచిపోయినట్లుగా నటించాను. అంతే! పరిస్థితులు నా మాట మీద నన్ను నిలబడనీయడం లేదు.... నన్ను క్షమించరా!"

"అంతే....?" ఆయోమయంగా చూస్తూ అన్నారు రంగనాథంగారు.

"చిన్నప్పుడు వాణిని చూసి, వాణిని నా కోడలిగా చేసుకుంటాననడం నేను మరచిపోలేదురా.... కానీ, ఇప్పుడు వాణి సినిమా నటి.... అది తప్పని నేననుగానీ, ఒక సినిమా నటిని నా కోడలిగా చేసుకోలేనురా! వాడిది కూడా అందుకు అంగీకరించే మనస్తత్వం కాదు.... ఈ విషయం గురించి నేనూ ఎన్నోసార్లు ఆలోచించాను.... నీ దగ్గరికి వచ్చి ఏవో చెప్దామని కూడా అనుకున్నాను.... కానీ వస్తే ఏమౌతుందో, నువ్వేమనుకుంటావో అని ఆ ప్రయత్నం చేయలేదు.... అమ్మాయి సినిమాల్లో చేరే ముందైనా నువ్వు నన్ను, నన్ను కాకపోయినా వాడినైనా ఒక్కసారి అడిగి ఉంటే బావుండేది...."

రంగనాథంగారు శ్రోతగా మిగిలిపోయారక్కడ... వినరానిది వింటున్నట్టుగా, జరగరానిది జరిగిపోతున్నట్టుగా ఉంది ఆయనకు.... రమణయ్యగారితో ఇప్పుడేమనాలో, ఎలా మొదలుపెట్టాలో ఎంత ఆలోచించినా మొద్దుబారిపోయిన మెదడుకు ఏ ఆలోచనా రావడంలేదు....

అయినా అతి కష్టంమీద అన్నారు.... "ఒరేయ్ రమణా! అయితే.... నీ ఆఖరు మాట. నీ నిర్ణయం అదేనా? నువ్వు నాకు సహాయం చేయలేవా! నా బాధను అర్థం చేసుకోలేవా?"

"ఒరేయ్! నాకూ ఆడపిల్లలున్నారు.... నీ పరిస్థితిని నేను అర్థంచేసుకోగలను... నేను చేయలేనిదైనా నీ బాల్యమిత్రుడిగా నీ మాటను కాదనలేను.... కష్టపడి లక్ష్మిని కూడా ఒప్పిస్తాను.... కానీ, వాడి ఇష్టాన్ని కాదనగలనే గానీ కాదనలేను.. ఇది వాడి జీవితానికి సంబంధించిన విషయం.... వాడిని నేను అడగను, అడగలేను గానీ, ఎలా అడుగుతావో ఏమో నువ్వేవాడిని అడుగు.... వాడు కానంటే నేను, లక్ష్మి కూడా కాదనే

పరిస్థితి రాదని హామీ ఇస్తున్నాను. వెళ్లు, వాడా గదిలో ఉన్నాడు...."

"ఒరేయ్ రమణా! చాలా థాంక్స్‌రా, అబ్బాయిని నేనే అడుగుతాను.... ఈ ముసిలివాడి బాధను అబ్బాయి అర్థంచేసుకుంటాడనే ఆశతో అడుగుతాను." అని బరువుగా ఉన్న గుండెను మోస్తూ, ఏదో ఆతృతతో అక్కడి నుండి కదిలారు రంగనాథంగారు....

ఆ గదిలో ఈజీ ఛెయిర్‌లో కూర్చొని ఏదో పుస్తకం చదువుతున్నాడు అనీల్....

ఆశపడుతున్న వస్తువు కన్పించినట్లుగా రంగనాథంగారి కళ్ళు వికసించాయి.... అతని కళ్ళకు ఆ సమయంలో అనీల్ దేవుడిలా కన్పించాడు...

...."బాబూ!"

ఆశ, ఆతృత, ఆవేదన, ఆలోచనల సమ్మేళనం ఆ పిలుపు....

చదువుకుంటున్నవాడల్లా ఒక్కసారి తల ప్రక్కకు త్రిప్పిచూసి "అంకుల్! మీరా? చాన్నాళ్ళకు వచ్చారు.... రండి, రండి!" అని ఈజీ ఛేయిర్‌లోంచి గభాల్న లేచి "రండి, ఇక్కడ కూర్చోండి!" అని కుర్చీ చూపించాడు అనీల్....

రమణయ్యగారు ఎలా వెళ్ళారో, ఎలా కూర్చున్నారో అతనికే తెలియలేదు. అనీల్ ప్రవర్తన, మన్నన అతనికి ఏనుగంత బలాన్నిచ్చాయి....

అనీల్ అక్కడున్న కుర్చీలో కూర్చున్నాడు....

"వాట్ అంకుల్? అంతా బాగున్నారా? మీ ఆరోగ్యం ఎలా వుంది!"

"నా ఆరోగ్యానికేం నాయనా? అందరూ అంటే ఎవరున్నారు నాకు! వాణి ఒక్కర్తే కదా, అది బాగానే ఉంది...."

"అంకుల్, మర్చేపోయాను.... వాణీ సినీలైఫ్ ఎలా ఉంది? పెద్దహీరోయిన్ అయిపోయే సూచనలున్నట్లున్నాయ్?" స్వచ్ఛంగా నవ్వుతూ అన్నాడు అనీల్...

అతని మాటల్లో ఏ భావమూ లేకపోయినా రంగనాథంగా రెందుకో సిగ్గుతో కుచించుకుపోయారు.... "ఆ విషయం కోసమే వచ్చాను బాబూ నీ దగ్గరకు.... వాణి నీకు తెలుసుగా, దానిమీద నీ అభిప్రాయం ఏమిటి?"

"అదేంటి అంకుల్ అలా అడుగుతున్నారు? వాణీ ఎ నైస్ గర్ల్...చిన్నప్పుడు మేమిద్దరం కలిసే ఆడుకునేవాళ్ళం కదా!" అన్నాడు సాధారణంగా అనీల్....

"బాబూ అనీల్! ఆ ధైర్యంతోనే, నీ మీద నాకున్న ప్రేమ, చనువులతోనే ఒక విషయం అడగడానికి వచ్చాను.... నన్ను కాదనవు కదూ?"

అసలైన విషయం అడగాల్సిన సమయం దగ్గరయ్యేకొద్దీ రంగనాథంగారి గొంతు గాద్గదికమౌతోంది....

"చెప్పండి అంకుల్! నేను కాదనేది కాకపోతే కాదని అనను.... చెప్పండి!"

"బాబూ! మా అమ్మాయి వాణిని నీకిచ్చి పెళ్ళిచేద్దాం అనుకుంటున్నాను.. మీ నాన్న కూడా నీ ఇష్టమే తన ఇష్టం అన్నాడు.... నీ అభిప్రాయం చెప్పు బాబూ!"

అనీల్ తల దించుకున్నాడు... ఏమీ మాట్లాడలేదు...

"బాబూ అనీల్! మాట్లాడవేం... నాయనా? దుఃఖం అదుపుతప్పి పోతుంది రంగనాధంగారిలో....

అనీల్ పెదవులు కదిలాయి...

"....అంకుల్! నేను బెట్టుచేస్తున్నానని అనుకోకపోతే నా మాటలు వినండి. మీరేమైనా అనుకున్నా, అనుకోకపోయినా.... ఆలోచిస్తారని ఆశిస్తూ నా అభిప్రాయాన్ని చెప్తున్నాను.... నేను వాణిని పెళ్ళిచేసుకోను.... సారీ! కారణం ఏమిటని అడగొద్దు.... ముసుగులో ముద్దులాడుకోవడం, మనసులోనే మధనపడ్డం నా అభిమతం కాదు.... అది నిష్ఠూరానికి భయపడి అప్పైన నా మనసు వేసే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక. ఎదుటివారిని అనుమానించి, అవమానించే వాళ్ళ అభిరుచులకు అనకట్ట వేయలేక, ఆ అభిరుచిని సహించలేక.... నేను బాధపడి, ఎదుటివారిని బాధపెట్టలేను అంకుల్! అయామ్ ఎక్స్ట్రీమ్లీ సారీ అంకుల్! అయినా వాణి కోరుకుంటే నన్ను మించిన వాడు భర్తగా దొరుకుతాడు.... నేను నా మనసు వైశాల్యాన్ని పెంచుకోలేని, ఎంతో ఎత్తుకి ఎదగలేను...నేను వాణిలో నా భార్యను చూడలేను.... నన్ను క్షమించండి అంకుల్!...." అని ఆ గది లోంచి బయటకు వెళ్ళిపోయాడు అనీల్.

రంగనాధంగారు కుప్పలా కూలిపోయారు....

## 3

రంగనాధంగారు అలసిపోయారు.... అతనింక ఆలోచించలేక పోతున్నారు.... అలసిపోయిన అతని శరీరం ఏదో భయంతో వణికిపోతుంది.... అలసిపోయినా ఆగని ఆలోచనలు అతడి మెదడును ముక్కలు ముక్కలు చేసేస్తున్నాయి....

ఆ తర్వాత.... ఇంకా.... కలలాంటి ఆ కథ ఇంకా ముందుకుసాగితే వాణి ఏమౌతుంది? తనేమైపోతాడు? తనప్పుడు బ్రతగ్గలడా?

నేనెందుకు ఇలా అయిపోతున్నాను? ఎందుకు ఏమీ పట్టించుకోకుండా ఉండలేక పోతున్నాను....?

వాణి నా ప్రాణం!

నాలాంటి మరో తండ్రి పాత్రను ఆ దేవుడు సృష్టించాడా? సృష్టిస్తే అతనూ ఇలాగే తరగని, ఆగని ఆలోచనలతో సతమతమైపోతాడా?

మరో తండ్రయితే, అతనికీ ఇలాంటి పరిస్థితులే ఉంటే అతనూ ఇలాగే ఆలోచిస్తాడా?

ఆలోచిస్తాడు.. ఎందుకు ఆలోచించడు?

.... లోపల్నుంచి ఎవరో ఇచ్చిన సమాధానం....

మరి ఎందరో అమ్మాయిలు, తల్లి దండ్రులున్న అమ్మాయిలు సినిమాల్లో నాకు నచ్చని రీతుల్లో నటిస్తున్నారు .... మరి ఆ తల్లిదండ్రులు నాలా బాధపడు తున్నారా?

"........" లోపల్నుండి ఏ సమాధానమూ రాలేదు....

అందరి సంగతి, ఎవరో సంగతి నా కెందుకు?.... రంగనాథంగారు తనను తానే సమాధానపరుచుకున్నారు....

ఒకవేళ నేను అర్థంలేకుండా ఆలోచిస్తున్నానా?

నో.... నో.... నావి అర్థంలేని ఆలోచనలు కావు.... మనిషి దేనికీ లొంగగూడదని, దేనికోసమో తన సర్వస్వాన్నీ పోగొట్టుకోగూడదని, అశ్లీల ప్రోత్సాహకులు కాకూడదని...ఆడదానికి ఏ వయసులో ముచ్చట ఆ వయసులో తీరాలని, ఆ శోభను చూసిన తల్లి దండ్రులు మురిసిపోవాలని, దేనికో ఆకర్షింపబడి, ఏదో ముసుగువేసుకొని, మనిషిగా నాశనం అయిపోగూడదని, ఆ ఆకర్షణలో నిజమైన ఆత్మవిమర్శ చేసుకుంటే బెదిరిపోకుండా, భయపడకుండా, స్థిరంగా ఉండగలగాలని.... ఇలాంటివే మరికొన్ని.... ఇవి అర్థంలేని ఆలోచనలా?

నో! నెవ్వర్...కాదు...కాకూడదు...

అయితే ఇప్పుడు నేనేం చేయాలి? ఏం చేసినా వాణిని దారి మళ్ళనివ్వగూడదు.... ఆమె నిర్లక్ష్యం చేస్తున్న భవిష్యత్తును కాపాడాలి.... అదే నేను చేయాల్సింది! అదే నేను చేయాలి!

చేస్తాను.... ఎలాగైనా, ప్రేమను గుండెలో దాచేసుకొనైనా, గుండెను రాయి చేసుకొనైనా, నిష్కర్షను ప్రదర్శించైనా చేసి తీరతాను.... ఆ తర్వాత జరగాల్సింది జరగక మానదు..

ఊపిరాడనివ్వని ఆలోచనల్ని అదుపులో పెట్టేసరికి ఆ ముసలి తనువు పూర్తిగా అలసిపోయింది....

* * *

గడియారం అయిదు గంటలు కొట్టేసరికి ఉలిక్కిపడి లేచారు రంగనాథంగారు....

అంతలోనే ఎదురుగా ప్రత్యక్షమైంది వాణి....

ఆలోచనల్లో చూసిన వాణికి, ఈ వాణికి ఎంత తేడా?

అందం, ఆకర్షణ, చిలిపితనం, చిన్నారితనం, బేలతనం తమ సొత్తే అంటున్నట్లున్న నేత్రద్వయం, విల్లుల్లా వంగిన కనుబొమలు, కోటేరేసిన ముక్కు, లేత గులాబీల్లాంటి బుగ్గలు, ముద్దొచ్చే చుబుకం.... అందమైన నవ్వు, మంచి ఎత్తు, శరీర సౌష్ఠవం.... వాణిది.

"ఏమిటి డాడీ? అలా చూస్తున్నారేమిటి? టైమిప్పుడు సరిగ్గా.... ఆఁ.... అయిదు

గంటల ఒకటిన్నర నిమిషాలు.... రేపే నా బర్త్‌డే! నా గిఫ్ట్‌గా ఇస్తానన్న మీ నిర్ణయం ఏమిటి డాడీ? నేను సినిమాలో నటించాలా? వాళ్ళను మనింటికి రమ్మనాలా?" ఆతృతగా అడుగుతుంది వాణి....

రంగనాథంగారి పెదవులు కదిలాయి...

"డాడీ!"

తండ్రి చెప్పిన మాట విని దెబ్బ తిన్నట్లుగా, ఓడిపోయినట్లుగా గట్టిగా అరిచింది వాణి....

రంగనాథంగారు వాణివైపు ఒక్క-క్షణం చూసి.... "వాణీ! నువ్వు కుసంస్కారుడు, ఎదగని మనిషి, అన్ ఎడ్యుకేటెడ్ ఓల్డ్ క్రీచర్.... ఇలా ఏమనుకున్నా, ఎన్ననుకున్నా నేనేమీ అనుకోను.... నేనే కాదు.... నాలాంటి తండ్రి ఎవరైనా అతను మనసును ఏ మాత్రం చంపుకోకపోయినా ఇలాగే, ఈ విధంగా నే అంటాడు! ఈ నిర్ణయాన్నే తీసుకుంటాడు! నీకు లోటేముంది? డబ్బు కోసం నా నిర్ణయాన్ని కాదనదలుచుకుంటే ఎంత డబ్బైనా నీకు సంపాదించి పెడతాను...కాదు, కళకోసం అనుకుంటే, అదికాక, ఇంకా ఎన్నో కళలున్నాయి.... నాట్యం నేర్చుకో, సంగీతం నేర్చుకో... లేకపోతే ప్రయత్నించి సాహిత్యసాధన చేయి.... అది ఏ కళైనా, నువ్వెంత కోరుకున్నా, నువ్వెంత అభివృద్ధి చెందాలన్నా నీవు నీవుగా ఉండేలాగనే అభివృద్ధిని ఆకాంక్షించు.... నువ్వు కోరుకునే ఈ దారి నిన్ను నిన్నుగా ఉండ నీయదమ్మా! ఎన్నో ఆలోచించి, నీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తీసుకున్న నిర్ణయం ఇది! కాదనను."

"నో డాడీ! మీరు ఆలోచించడంలేదు .... ఊహిస్తున్నారు.... అందుకే ఇలా మాట్లాడుతున్నారు."

"అవునమ్మా! నీ దృష్టిలో నేను ఊహించాను.... కానీ, నా వయసు, నా అనుభవాలు నీ భవిష్యత్తు గురించి ఆలోచించాయి...ఊహలల్లుకునే వయసు కాదు నాది...."

"అయితే నేను.... నేను సినిమాల్లో నటించవద్దా డాడీ? ఏం? ఎందుకు? చెప్పండి డాడీ!"

"చెప్పడానికి ఏముందమ్మా? అది మరో ప్రపంచం! మిథ్యా ప్రపంచం.... తియ్యగా ఉండే విషం! ఆ ప్రపంచానికీ మనకీ మధ్య బలమైన పొర ఒకటి ఉంది .. దాన్ని ఛేదించుకొని ఆ ప్రపంచంలోకి అడుగు పెడ్తే ఆడది అన్నింటినీ కోల్పోతుంది.... ఒకవేళ మిగిలితే డబ్బు ... అడుగు కదపనివ్వని, ఊపిరి సలపనివ్వని, తన గురించి ఏ మాత్రం ఆలోచించుకోనివ్వని, ఏ మాత్రం మనశ్శాంతి లేని జీవితం....అదీ కొందరికే! మిగిలినవారందరూ ఛేదించుకొని వెళ్ళిన పొరలోంచే బయటికి వచ్చి పడిపోతారు....వాళ్ళు వచ్చిపడేది మరలా

ఈ లోకంలోకి కాదమ్మా! అగాధంలోకి! కటిక చీకటిలోకి! నువ్వు మగవాడివి కాదమ్మా, ఆడదానివి! నా ప్రాణానివి!"

"మగవాడినైతే ఒప్పుకొనేవారా? ఏం డాడీ, ఆడదాన్నైతే అభివృద్ధిలోకి రాకూడదా? కళాకారిణి కాకూడదా? ఏ ఉద్దేశంతో మీరు నన్ను నటించవద్దంటున్నారు?"

"ఉద్దేశం ఒకటేనమ్మా! నువ్వు మనిషిగానే ఉండాలనీ, పెళ్ళి చేసుకొని పిల్లాపాపలతో కలకలలాడాలని, నీ బంగారు జీవితం నాకో విలువైన వరం కావాలని.... చూడమ్మా వాణీ! పాతికేళ్ళైనా నిండని ఎంతమంది సినీనటులు ఆత్మహత్యలు చేసుకోవడంలేదు? హత్యలు చేయబడడంలేదు? ఎంతమంది జీవితాలు అన్యాయం అయిపోవడంలేదు? ఇంకా, నేనాలోచించే విషయాలు తండ్రి, కూతురు మాట్లాడుకొనేవి కాదమ్మా! ఎవరికి వారు ఒంటరిగా కూర్చొని ఆలోచించుకొనేవి, నీ దృష్టిలో అయితే ఊహించుకొనేవి! ఆలోచించుకుంటావో ఊహించుకుంటావో నీ ఇష్టం! అప్పుడు కూడా నీ ఇష్టమే అంటే నేను కాదనను... కానీ ఈ ఆస్తిని నీ కిచ్చేసి, మన ఊరు వెళ్ళిపోతాను.... మళ్ళీ ఈ జన్మలో నీ ముఖం చూడను.... నీ దగ్గరకు రాను .. నా దగ్గరికి నిన్ను రానివ్వను.... నువ్వు నా కూతురివని ఎవ్వరితోనూ చెప్పకోను.. నీ పరిస్థితిని నేను భరించలేని రోజులే వస్తే నా ప్రాణాన్ని కూడా తీసుకుంటాను.... ఆలోచించుకో! ఒంటరిగా కూర్చొని అన్ని విషయాలూ, అన్ని కోణాల్నుండీ ఆలోచించుకోమ్మా! అంతా నీ ఇష్టానికే వదిలేసాను...." అని అక్కడినుండి బరువుగా నడుచుకుంటూ బయటికి వెళ్ళిపోయారు రంగనాథం గారు....

వాణికి ఏమీ అర్థంకాలేదు....

అలా వెళ్ళిపోతున్న తండ్రివైపు అయోమయంగా చూస్తూ అక్కడున్న కుర్చీలో కూర్చుండిపోయింది....

కొంతసేపటికి బయట కారు స్టార్టు అయిన శబ్దం విన్పించింది వాణికి....